# నేరము శిక్ష

భావ్య హాస్టల్ గేటు ముందు గస్తీ తిరుగుతున్నాడు వాచ్‌మెన్ బల్‌బీర్.
సమయం అర్ధరాత్రి అవడంవల్ల రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.
హాస్టల్ పక్కనే శ్మశానం కూడా ఉండడం వల్ల వాతావరణం భీతి గొలిపేదిగా ఉంది.
బల్‌బీర్‌కు కూడా భయంగా ఉన్నా ఉద్యోగధర్మం నిర్వర్తించాలి కనుక
మనసులో హనుమాన్ చాలీసా చదువుకుంటూ కాపలా కాస్తున్నాడు.

## హాస్టల్

ఆదిత్య



హాస్టల్‌లోని కుర్రాళ్ళెవరూ రాత్రిళ్ళు బయటకు రాకుండా కాపలా కాయడం అతని విధుల్లో ఒకటి. అలా తిరుగుతున్న అతని వీపు మీద ఎవరో రాయి విసిరారు. వెనక్కి తిరిగి చూసాడు. ఎవరో పదిరూపాయల నోటులో రాయిని చుట్టి విసిరారు. అటూ, ఇటూ చూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. వంగి ఆ నోటుని తీసుకున్నాడు.

మళ్ళీ ఓ రాయి వచ్చి తగిలింది మళ్ళీ దాన్ని తీసుకున్నాడు బల్‌బీర్. అలా తీసుకుంటున్నప్పుడు రెండు కాళ్ళు కనిపించాయి. నెమ్మదిగా తల ఎత్తి చూశాడు ఎదురుగా ఆకాష్ బాబు. ''ఆకాష్ బాబు...మీరా?'' అన్నాడు భయంగా.

''అవును నేనే.. ఏం దయ్యం అనుకున్నావా..?''

''అదికాదు ఈ వేళప్పుడు హాస్టల్ బయట ఏం చేస్తున్నారు..?''

''అది నీకనవసరం. నే విసిరేసిన నోట్లు తీసుకుని నోరు మూసుకుని గేటు తెరువు..'' అంటూ హుంకరించే సరికీ బల్‌బీర్ నిజంగానే నోరు మూసుకుని గేట్ తీశాడు.

ఆకాష్ నెమ్మదిగా తన రూంలోకి వెళ్ళిపోయాడు. తననెవ్వరూ చూడలేదనుకున్నాడు. కాని ఓ రెండు జతల కళ్ళు అతన్ని చూడనే చూశాయి.

* * *

రూమ్ నంబర్ నూట పదకొండులో అప్పుడే నిద్దుర లేచిన రాహుల్‌కు తన పక్కనే ఉన్న బెడ్‌పై రూమ్‌మేట్ అరుణ్ బద్ధకంగా పడుకొని ఉండడం కనిపించింది. అతని పక్కనే ఉన్న కంప్యూటర్ ఆన్ చేసివుంది. స్క్రీన్‌పై మోనికా ఫోటోలు కనిపించగానే కోపంతో ఉడికిపోయాడు రాహుల్.

తన గర్ల్‌ఫ్రెండ్ మోనికా జోలికి రావద్దంటున్నా వినకుండా అరుణ్ ఈ రకంగా తనను టీజ్ చేయడం సహించలేకపోయాడు రాహుల్.

అందుకే కోపంతో ఒక్క ఉదుటున బెడ్‌పైనుంచి లేచి ''ఒరే అరుణ్..నీకు మూడిందిరా, ఈ రోజు నువ్వో నేనో తేలిపోవాలి..'' అంటూ అరుణ్ మంచం దగ్గరకు చేరి చేతుల్తో తట్టి లేపసాగాడు ''లేవరా..నిన్నే లేవమంటుంటే..'' అంటూ అటూ ఇటూ ఊపసాగాడు.

అరుణ్ లేవలేదు సరికదా రాహుల్ జోరుకి దబ్బుమని మంచం మీదినుండి పడిపోయాడు.

రాహుల్‌కు అప్పుడు అనుమానం వచ్చి తొంగిచూశాడు. అరుణ్‌లో ఎలాంటి చలనం లేదు. చెయ్యి చల్లగా మంచులా తాకింది.

ఒక్కసారి షాక్ కొట్టినట్లయింది రాహుల్‌కు. అసంకల్పితంగా బిగ్గరగా అరిచాడు.


నిమిషాల్లో అక్కడి సీన్ మారిపోయింది. పోలీస్ జీపులో ఎస్.ఐ. షిండే అక్కడికి చేరుకున్నాడు.

అరుణ్ శవాన్ని నిశితంగా పరిశీలించాడు షిండే.

''రూమ్‌లో ఉన్నది మీరిద్దరే కనుక ఈ హత్య నువ్వే చేసుండాలి'' అంటూ రాహుల్‌పై అభియోగం మోపి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్తుంటే, ఆకాష్ అడ్డు వచ్చాడు.

''ఎస్.ఐ.గారు కేవలం అనుమానం మీదే మీరు రాహుల్‌ని అరెస్ట్ చేస్తున్నారు. రాహుల్ అరుణ్‌ని చంపుతుండగా ఎవరైనా చూశారా..? పోనీ రాహులే హంతకుడనటానికి ఏదైనా ఆధారాలున్నాయా...'' అంటూ ప్రశ్నించాడు.

''మిస్టర్ ఆకాష్... నువ్వు స్టూడెంట్‌వి. అనవసర విషయాల్లో కలుగజేసుకోవడం అంత మంచిది కాదు..'' అంటూ హెచ్చరించి రాహుల్‌ని పోలీస్



స్టేషన్‌కు తీసుకెళ్ళాడు ఎస్. ఐ. షిండే.

* * *

పోలీస్ స్టేషన్‌లో రాహుల్ తల్లి సునంద ఎస్.ఐ. షిండేను కలిసింది.

''ఎస్. ఐ.గారు మా రాహుల్ అమాయకుడు. కొంచెం దూకుడుగా ఉంటాడే కాని వాడీ హత్య చేసుండడు'' అంది.

వాచ్‌మెన్ బల్‌బీర్‌ని పిలిపించాడు ఎస్.ఐ.

''బల్‌బీర్ ఈ హాస్టల్లో కుర్రాళ్ళందరి సంగతి నీకు తెలిసే ఉంటుంది. అసలు ఈ రాహుల్‌కు, అరుణ్‌కు మధ్య గొడవలేమైనా వున్నాయా..?'' అడిగాడు షిండే.

''సార్ వాళ్ళిద్దరూ రెండేళ్ళుగా ఒకే రూమ్‌లో ఉంటున్నారు. ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవు. కాని..'' అంటూ ఆగిపోయాడు బల్‌బీర్.

''ఏమిటీ..? నానుస్తున్నావు.. చెప్పు వాళ్ళిద్దరి మధ్య ఏమిటి గొడవ'' రెట్టించి అడిగాడు షిండే.

''ఈ మధ్యే రాహుల్ మోనికాతో ప్రేమలో పడ్డాడు. వారం క్రితం ఓ పార్టీ జరిగింది. ఆ పార్టీలో అరుణ్ పీకలదాకా తాగి మోనికా వెంటపడడమే కాదు అందరి ముందు ఆమె చెయ్యి పట్టి లాగాడు. అది చూసిన రాహుల్ అరుణ్‌తో గొడవపడ్డాడు.

మధ్యలో ఆకాష్‌బాబు కలగజేసుకుని వాళ్ళిద్దరినీ శాంతింపజేయ చూశాడు. కాని ఇద్దరూ రెచ్చిపోయి మాటామాటా అనుకున్నారు. ఆ గొడవ అక్కడితో ఆగలేదు.

నిన్న రాత్రి అరుణ్ తన కంప్యూటర్‌లో మోనికా ఫోటోలు డౌన్‌లోడ్ చేసుకోవడం చూసి రాహుల్ అరుణ్‌ను తన రూమ్ ఖాళీ చెయ్యమన్నాడు. కాదంటే చంపేస్తానని బెదిరించాడు'' అంటూ చెప్పాడు బల్‌బీర్.

పోలీస్ స్టేషన్‌లో ఆ సంభాషణ జరుగుతుండగా ఆకాష్ మళ్ళీ అక్కడకు చేరుకున్నాడు.

''రాహుల్ బెదిరించాడే కాని అరుణ్‌ని చంపలేదు'' అన్నాడు.

ఆకాష్ అలా మధ్యలో కలుగజేసుకోవడం షిండేకు నచ్చలేదు.

''రాహుల్ తరుపున వకాల్తా పుచ్చుకున్నట్లు మాట్లాడుతున్నావు మరి ఆ హత్య ఎవరు చేసారంటావు... నువ్వు గాని చేసావా..?'' ఎస్.ఐ. అలా సూటిగా అడిగేసరికి ఉలిక్కిపడ్డాడు ఆకాష్.

ఏదో చెప్పాలనుకున్నాడు ఆకాష్. కానీ చెప్పకుండానే వెనుదిరిగాడు.

* * *

మర్నాడు షిండే భావ్య హాస్టల్ వెళ్ళి అక్కడున్న స్టూడెంట్స్‌ని విడివిడిగా పిలిచి విచారణ సాగించాడు.

రూపేష్, సతీష్, వరుణ్ అలా ఒక్కొక్కరినీ వాళ్ళ రూముల్లోనే విచారణ సాగించాడు.

రూపేష్ రూమ్‌లోని ఓ ఫోటో షిండేని ఆకర్షించింది. దాన్ని జాగ్రత్త చేసాడు షిండే.

ఆకాష్ రూమ్ చేరుకునే సరికి రూమ్ తలుపులు వేసున్నాయి. నెమ్మదిగా తలుపు తట్టే సరికి కిర్రుమంటూ తలుపులు తెరుచుకున్నాయి.

ఆ గదిలోని దృశ్యం చూసిన అందరూ షాక్‌కి గురయ్యారు. గదిలోని కుర్చీలో ఆకాష్ నిర్జీవంగా పడివున్నాడు.

మొదటి కేసే తేలలేదంటే ఇప్పుడు ఇంకో హత్య జరగటంతో ఎస్.ఐ. షిండేకు దిగ్భ్రాంతి కలిగించింది.


అసలు ఈ హత్యలకు మూలకారణమైన మోనికాను పిలిపించి ఆమెను కూడా విచారించాడు షిండే. ఆమె చెప్పిన విషయాలు విని ఆశ్చర్యపోయాడు.

ఆకాష్ హత్య జరిగిన చోట రాహుల్ రిస్ట్ వాచీ కనిపించింది. మళ్ళీ రాహుల్ తనకేమీ తెలియదనీ షిండే ముందు వాపోయాడు.

''మిస్టర్ రాహుల్ ఇంతవరకు నటించింది చాలు. నీ ప్రియురాలు మోనికా కూడా నువ్వే హంతకుడవని చెబుతోంది..''

ఆ మాటలతో కృంగిపోయాడు రాహుల్. మోనికాను నిలదీశాడు.

''నువ్వు జైలు నుండి వచ్చింతర్వాతే మన పెళ్ళి..'' అని తేల్చి చెప్పింది.



ఎస్.ఐ. షిండే హాస్టల్ స్టూడెంట్ బ్యాంక్ అకౌంట్ చెక్ చేశాడు. హత్యకు ముందురోజు ఆకాష్ పదివేల రూపాయలు డ్రా చేశాడు. విచిత్రంగా ఆ మర్నాడే అంతే మొత్తం రొక్కం రాహుల్ అకౌంట్‌లో జమ అయి ఉంది. అంటే డబ్బు కోసం రాహుల్ ఈ హత్య చేశాడని రూఢీ అయింది.

* * *

మెల్లగా తలుపు తట్టిన చప్పుడవడంతో వెళ్ళి తలుపు తీసింది ఆ యువతి. లోపలికొచ్చిన యువకుణ్ణి వాటేసుకుంటూ ''ఏవిటింత ఆలస్యం?'' అడిగిందా పడతి.

''నీకేం..కబుర్లు చెబుతావు.. ఈ లేడీస్ హాస్టల్లోకి అడుగు పెట్టాలంటే ఎంత రిస్కో తెలుసా..'' అంటూ ఆ యువతి పెదాలు అందుకున్నాడు. తన్మయంగా కళ్ళు మూసుకుందా కన్నెపిల్ల.

ఓ పది నిముషాలవరకు ఇద్దరి మధ్య మాటల అవసరం లేకపోయింది. ''ఇంక మనం స్వేచ్ఛగా తిరగొచ్చా..'' ఆశగా అడిగిందామె.

''ఆ రాహుల్‌గాడు మన పథకం వల్ల పీకలోతుల్లో కూరుకుపోయాడు. కాని మనం ఇప్పుడే తొందర పడకూడదు.. ఇంకొంత కాలం ఆగాలి..'' అన్నాడతను.

అప్పుడే ఎవరో తలుపు తట్టిన శబ్దం అవడంతో ఉలిక్కిపడ్డారిద్దరూ.

''అమ్మో కొంపదీసి మీ వార్డెన్ రాక్షసి కాదుగా'' అన్నాడతను.

''ఉండు చూసొస్తాను'' అంటూ డ్రెస్ సరిచేసుకుని తలుపు తెరిచింది. ఎదురుగా ఉన్న మనుషుల్ని చూస్తూనే ఉలిక్కిపడింది మోనికా.

* * *

అక్కడ సమావేశమైన వాళ్ళందర్నీ ఉద్దేశించి చెప్పసాగాడు ఎస్.ఐ.షిండే.

''హాస్టల్లోని గదుల్లో స్టూడెంట్లను విచారిస్తుంటే రూపేష్ రూమ్‌లో ఈ ఫోటోను చూశా'' అంటూ ఓ ఫోటో చూపించాడు షిండే.

డెహ్రాడూన్ పబ్లిక్ స్కూల్లో ఫోటో అది. అందులో రూపేష్, మోనికా కలిసున్నారు.

''ఆ తరువాత విచారణలో వాళ్ళిద్దరూ పాత ఫ్రెండ్సని తెలిసింది. కాలేజీలో చేరిన తర్వాత రాహుల్‌తో ఫ్రెండ్‌షిప్ చేస్తూ రూపేష్‌తో స్నేహం కొనసాగించింది.

మధ్యలో అరుణ్ హద్దు మీరడంతో రూపేష్ అరుణ్‌ని హత్య చేశాడు. అయితే ఆ రాత్రి ఆ దృశ్యం చూసిన ఆకాష్ రూపేష్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు లాగసాగాడు.

అందుకే ఆకాష్‌ను కూడా మట్టుబెట్టి తెలివిగా రాహుల్‌పై వచ్చేలా అతని వాచీని అక్కడ వదిలారు. అంతేకాదు. ఆకాశ్ డబ్బుల్ని రాహుల్ అకౌంట్‌లో జమ చేశారు. అయితే విత్‌డ్రాయల్ ఫాంపై సంతకం మోనికాది.. ఈ వివరాలు చాలా...'' షిండే అనేసరికి రూపేష్, మోనికాలు తలొంచుకున్నారు. ఇద్దర్నీ అరెస్ట్ చేశారు.

రాహుల్ కేసునుండి బయటపడ్డాడు. ★